క్లుప్తంగా

ఆకట్టుకున్న తోలుబొమ్మలాట



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): విజయవాడ ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో కాకినాడ మాధవపట్నంకు చెందిన శ్రీసాయి నిలయం వారు ప్రదర్శించిన తోలు బొమ్మలాట భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై తోట బాలకృష్ణ శిష్య బృందం రామాయణం, మహా భారతంలోని పలు ఘట్టాలను తోలుబొమ్మల రూపంలో చక్కగా ప్రదర్శించారు. అంతరించి పోతున్న కళలలో ఒకటైన తోలు బొమ్మలాటను భక్తులు ఎంతో ఆసక్తిగా వీక్షించారు. అనంతరం తోలు బొమ్మలాటను ప్రదర్శించిన బాలకృష్ణ శిష్య బృందంకు అమ్మవారి దర్శనం కల్పించి ప్రసాదాలు అందజేశారు. ఆలయ డీఈవో రత్నరాజు కళాకారులకు అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రాలు అందించారు.

విద్యుత్ దోపిడీ అరికట్టాలని ధర్నా



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ప్రజలపై అదనపు విద్యుత్‌చార్జీల పేరుతో కూటమి ప్రభుత్వం చేస్తున్న దోపిడీని రద్దు చేయాలని సీపీఎం పశ్చిమ నగర కార్యదర్శి, కార్పొరేటర్ బోయి సత్యబాబు డిమాండ్ చేశారు. పెంచిన విద్యుత్ చార్జీలను రద్దు చేయాలని కోరుతూ సీపీఎం పశ్చిమ నగర కమిటీ ఆధ్వర్యంలో స్థానిక నెహ్రూబొమ్మ సెంటర్ వద్ద బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం గ్యాస్ రాయితీ పేరుతో రెండు వేల కోట్లను ఇచ్చి సుమారు రూ.18 వేల కోట్ల భారాలను మోపటానికి సమాయత్తమైందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి సర్కార్ ఎన్నికల్లో అనేక వాగ్దానాలు చేసి వాటిని పూర్తిగా విస్మరించిందన్నారు. విద్యుత్ చార్జీలు పెంచబోమన్న ముఖ్యమంత్రి హామీ నిలబెట్టుకోవాలని కోరారు. కట్టేసిన కరెంటు బిల్లుకి నష్టమనే పేరుతో మరలా ప్రతినెలా ఆదనపు చార్జీలు, సర్దుబాటు చార్జీల భారాలు ఏమిటని ప్రశ్నించారు. ఈ నెల ఏడు నుంచి 14వ తేదీ వరకు అధిక ధరలు, నిరుద్యోగం, మహిళల రక్షణ అంశాలతో సీపీఎం ప్రజాపోరు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తుందన్నారు. ప్రజలందరూ ఈ పోరులో భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేస్తున్నట్లు కోరారు. ఐద్వా నగర అధ్యక్షురాలు కె.శేషమణి, నగర నాయకులు కె.సూరిబాబు, వి.నారాయణ, జి. వెంకట్రావు, విజయలక్ష్మి, ఎం.కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కల్తీ ఆహారం ప్రాణాంతకం



మధురానగర్(విజయవాడసెంట్రల్): కల్తీ ఆహారాన్ని తీసుకోవటం వల్ల అనారోగ్య సమస్యలు తలెత్తటంతో పాటు కొన్ని సందర్భాలలో ప్రాణాంతకం అవుతుందని ఎన్టీఆర్ జిల్లా అఖిల భారతీయ గ్రాహక్ పంచాయిత్ రాష్ట్ర కార్యదర్శి మోహన్‌రావు కొఠారి అన్నారు. స్థానిక మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె భాగ్యలక్ష్మి అధ్యక్షతన ఆహారపు కల్తీ అనే అంశంపై అవగాహన కార్యక్రమం జరిగింది.

కల్తీ జరగకుండా చూసుకోవాలి..

కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఆహారంలో కల్తీ క్షమించరాని నేరంగా పరిగణించాలన్నారు. ఆహారంలో కల్తీ ఏ విధంగా జరుగుతుంది వాటిని ఏ విధంగా గుర్తించాలో వివరించారు. ఆహార పదార్థాల ప్యాకెట్లపై ఎఫ్ఎస్ఎస్ఏఐ ముద్ర ఆహార భద్రతను సూచిస్తుందన్నారు. ఎఫ్ఎస్ఎస్ఏఐ ముద్ర ఉన్న ఆహార పదార్థాలను మాత్రమే కొనుగోలు చేయాలని సూచించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులు కల్తీ ఏ విధంగా జరుగుతుందో తెలుసుకోవటంతో పాటు కల్తీ జరగకుండా చూసుకోవాలని సూచించారు. ఇక్కడ నేర్చుకున్న అంశాలను తోటివారికి సామాజిక బాధ్యతగా తెలియజేయాలన్నారు. వినియోగదారుల క్లబ్ కన్వీనర్ డాక్టర్ కె.నవీన నూతన వినియోగదారుల రక్షణ చట్టం గురించి విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు అడిగిన పలు సందేహాలను నివృత్తి చేశారు.

దాసాంజనేయుని హుండీ ఆదాయం రూ.11.80 లక్షలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్వయంభూ మాచవరం శ్రీ దాసాంజనేయస్వామివారి దేవాలయంలో భక్తులు హుండీల ద్వారా సమర్పించిన ఆదాయం రూ.11 లక్షల 80 వేల 915 నగదు, కిలో 36 గ్రాముల వెండి లభించింది. దాసాంజనేయస్వామి వారి దేవాలయంలో బుధవారం దేవదాయశాఖ విజయవాడ డివిజన్ ఇన్‌స్పెక్టర్ ఎ.సుజన్ కుమార్, సేవా దళం సభ్యుల పర్యవేక్షణలో హుండీ లెక్కింపు జరిగింది. 4 నెలల 23 రోజులకు గానూ ఈ ఆదాయం వచ్చినట్లు ఈవో లోకేశ్వరి చెప్పారు.

నాడు చోద్యం.. నేడు ప్రైవేటు స్థలంలో 'షో'లు

- కోట్లు కుమ్మరించినా పున్నమిఘాట్ పరాధీనం
- పున్నమిఘాట్‌లో తమ స్థలానికి ప్రహరీ కట్టిన యజమానులు
- నాడు స్పందించని జిల్లా యంత్రాంగం
- సీ ప్లేన్ డెమో చూపించేందుకు ప్రైవేట్ గ్రౌండే దిక్కు



పున్నమిఘాట్‌కు ఉత్తరం వైపు ప్రవేశ ద్వారం వద్ద నిర్మించిన ప్రహరీ



పున్నమిఘాట్‌లో పరాధీనంలో ఉన్న ఘాట్ సెంటర్ పాయింట్

భవానీపురం(విజయవాడపశ్చిమ):నాడు అయినా.. నేడు అయినా టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు ఈవెంట్ల పేరుతో 'షో' చెయ్యడం పరిపాటి.

కృష్ణానదీ తీరాన అప్పట్లో నిర్వహించిన ఎయిర్ షో అయినా.. పవర్ బోట్ రేసులు అయినా వాటికి అయ్యే కోట్లాది రూపాయలు ఏపీ పర్యాటక శాఖే భరించింది. ఇటీవల కృష్ణానదీ తీరాన భవానీపురంలోని బబ్బూరి గ్రౌండ్స్‌లో నిర్వహించిన 'శక్తి విజయోత్సవ్' వేడుకలకు కూడా ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థే సుమారు రూ.7 కోట్లు ఖర్చు చేసినట్లు తెలుస్తుంది. రెండు రోజులపాటు నిర్వహించిన ఈ కార్యక్రమానికి తొలి రోజు మాత్రమే ముఖ్యమంత్రి సతీమణి నారా భువనేశ్వరి, హోం శాఖ మంత్రి అనిత, సంక్షేమ శాఖ మంత్రి సవిత మాత్రమే హాజరు కావడం గమనార్హం. కాగా ఈ నెల 9న కృష్ణానదీ తీరాన ప్రభుత్వం నిర్వహించనున్న 'సీ ప్లేన్' డెమో కార్యక్రమానికి కూడా ప్రైవేట్ వ్యక్తులకు చెందిన బబ్బూరి గ్రౌండే వేదిక కానుంది. దీనికి ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరవుతారని ప్రచారం జరుగుతుంది. కృష్ణానది తీరాన పుష్కరాలకు నాటి ప్రభుత్వం నిర్మించిన పున్నమిఘాట్‌ను ప్రైవేట్ వ్యక్తులకు వదిలేసి ఇప్పుడు పున్నమిఘాట్ పక్కనే ఉన్న బబ్బూరి గ్రౌండ్స్‌ను ఉపయోగించుకోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నాటి టీడీపీ ప్రభుత్వమే పున్నమిఘాట్‌కు కేంద్ర బిందువైన స్థలం విషయంలో కోర్ట్‌లో గెలిచిన ప్రైవేట్ వ్యక్తులకు ఎంతో కొంత ఇచ్చి సెటిల్ చేసుకుని ఉంటే ఈ రోజు ప్రైవేట్ స్థలాల వైపు చూసే పని ఉండదు కదా అన్నది ప్రజల వాదనగా ఉంది. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఈవెంట్లకు ప్రైవేట్ స్థలమే దిక్కు అవడం వెనుక పెద్ద కథే ఉంది.

అదేమిటంటే...

గత కృష్ణా పుష్కరాల సమయంలో (2016) అప్పటి టీడీపీ ప్రభుత్వం రివర్ ఫ్రంట్ పేరుతో కోట్ల రూపాయల ప్రజాధనాన్ని కుమ్మరించి నిర్మించిన పున్నమిఘాట్‌లో సింహభాగం ప్రస్తుతం పరాధీనంలో ఉంది. 2016లో పున్నమిఘాట్ నిర్మాణం పూర్తయ్యాక కొంత మంది వ్యక్తులు పున్నమిఘాట్‌లో కొంత స్థలం (సర్వే నెంబర్లు 106/1, 106/2)లోని1.71 ఎకరాలు) తమదేనంటూ న్యాయస్థానాన్ని ఆశ్రయించటం, ఆ స్థలాన్ని వారికి అప్పచెప్పండంటూ న్యాయస్థానం తీర్పు ఇచ్చింది. అంతే కాకుండా కోర్టు ధిక్కారం కింద అప్పటి సబ్ కలెక్టర్, మున్సిపల్ కమిషనర్, ఎమ్మార్వోలకు నాలుగు వారాల జైలు శిక్ష, రూ.2వేలు జరిమానా సైతం విధించింది. అప్పటి వరకు నాటి టీడీపీ ప్రభుత్వంలోని జిల్లా యంత్రాంగం చోద్యం చూసింది తప్ప ఏమీ చేయలేని పరిస్థితిలో చేతులెత్తేసింది. ఏపీ పర్యాటక అభివృద్ధి సంస్థకు చెందిన పున్నమిఘాట్ కేంద్రబిందువైన స్థలాన్ని కోర్టుకు వెళ్లిన ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించి చేతులు దులుపుకుంది. దాంతో కోర్టులో గెలిచిన ప్రైవేట్ వ్యక్తులు పున్నమిఘాట్‌లోని తమ స్థల హద్దుల మేర ప్రహరీ కట్టుకున్నారు. అప్పటి నుంచి ప్రభుత్వం ఏ ఈవెంట్ నిర్వహించాలన్నా ప్రైవేట్ స్థలాన్ని ఆశ్రయించక తప్పని పరిస్థితి నెలకొంది.

అంబికాదేవిగా భ్రమరాంబ అమ్మవారు



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పాతబస్తీలోని పురాతన ఆలయమైన పాతశివాలయంలో భ్రమరాంబ అమ్మవారు అంబికాదేవిగా బుధవారం దర్శనమిచ్చారు. శ్రీ భ్రమరాంబ మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం (పాతశివాలయం)లో జరుగుతున్న కార్తీకమాస నక్తదీక్షా మహోత్సవాల్లో భాగంగా ఆలయంలో బుధవారం పలు ప్రత్యేక వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీ భ్రమరాంబ అమ్మవారికి అంబికదేవి అలంకారం గావించి త్రిశతి, ఖడ్గమాల, సహస్రనామార్చన, శ్రీ మల్లేశ్వరస్వామి వారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, మహాలింగార్చన, ఆలయ ప్రదక్షిణలు, పంచహారతులు, చతుర్వేద స్వస్తి తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి నటరాజన్ షణ్ముగం పర్యవేక్షించారు.

బెరంపార్క్‌లో పచ్చదనం వెల్లివిరియాలి

– ఏపీటీడీసీ చైర్మన్ నూకసాని బాలాజీ



పున్నమిఘాట్‌లో పరిశీలిస్తున్న చైర్మన్ బాలాజీ

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఇటీవల సంభవించిన కృష్ణానది వరద కారణంగా తీవ్రంగా దెబ్బతిన్న ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ)కు చెందిన భవానీపురంలోని హరిత బెరంపార్క్ పునరుద్ధరణ పనులను ఏపీటీడీసీ చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ బుధవారం పరిశీలించారు. బెరం పార్క్ ప్రాంగణం, పరిసరాలను అధికారులతో కలిసి నిశితంగా పరిశీలించారు. వరద ప్రభావంతో ఇంకా అక్కడక్కడ పేరుకు పోయిన బురద మట్టిని వెంటనే తొలగించి శుభ్రం చేయాలని సిబ్బందిని ఆదేశించారు. శుభ్రం చేసిన ప్రదేశాల్లో వరద ముంపులో నామరూపాలు లేకుండా పోయిన పచ్చదనాన్ని తిరిగి పెంపొందించి గ్రీనరీ వెల్లివిరిసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా కార్తీక మాసాన్ని పురస్కరించుకుని వచ్చే పర్యాటకులకు బెరంపార్క్ పూర్వ వైభవాన్ని తీసుకురావాలని అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. అదే విధంగా రిసార్ట్స్, రెస్టారెంట్ పునరుద్ధరణ పనులను త్వరితగతిన పూర్తి చేసి పర్యాటకులకు అందుబాటులో ఉండేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో ఏపీటీడీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ప్రాజెక్ట్స్) శేషగిరిరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీనివాసరావు, డీఎమ్ కృష్ణచైతన్య, బెరం పార్క్ యూనిట్ మేనేజర్ కె.శ్రీనివాస్, డీఈ శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నూతన క్రీడా పాలసీలో పారా క్రీడాకారులకు ప్రత్యేక స్థానంపై హర్షం



సీఎం చంద్రబాబుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కోటేశ్వరరావు

విజయవాడస్పోర్ట్స్: నూతన క్రీడా పాలసీలో పారా(దివ్యాంగ) క్రీడాకారులకు ప్రత్యేక స్థానం కల్పించడం పట్ల ఆంధ్రప్రదేశ్ పారా స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గోనుగుంట్ల కోటేశ్వరరావు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు సీఎం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబును కోటేశ్వరరావు బుధవారం మర్యాదపూర్వకంగా కలుసుకుని పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. పారా క్రీడాకారులను ప్రోత్సహించేలా పాలసీని రూపొందించడం అభినందనీయమని కోటేశ్వరరావు తెలిపారు. రానున్న రోజుల్లో రాష్ట్రం గర్వపడేలా పారా క్రీడాకారులను తయారు చేస్తామని హామీ ఇచ్చారు. క్రీడా పాలసీ రూపకల్పనలో ప్రముఖ పాత్ర పోషించిన క్రీడా మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు.

మహాసభలు జయప్రదం చేయండి



విద్యార్థులతో కలసి మహాసభల పోస్టర్ ఆవిష్కరిస్తున్న కాసాని గణేష్‌బాబు

వించిపేట(విజయవాడపశ్చిమ): డిసెంబర్ 14, 15 తేదీలలో నగరంలోని మాకినేని బసవ పున్నయ్య విజ్ఞాన కేంద్రం (ఎంబీవీకే)లో జరగనున్న భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని యూఎస్ఎఫ్ఐ రాష్ట్ర కన్వీనర్ కాసాని గణేష్‌బాబు పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం వించిపేటలోని ఎంసీపీఐ(యూ) కార్యాలయంలో విద్యార్థి నాయకులతో కలసి మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గణేష్‌బాబు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా విద్యారంగంలో వస్తున్న పెనుమార్పులపై భవిష్యత్ కార్యక్రమం రూపొందించుకురని విద్యాహక్కు చట్టాన్ని బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను కాపాడుకోవాలని, కొఠారి కమిషన్ ప్రకారం విద్యా రంగానికి కేంద్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని కోరారు. అదే విధంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను కళాశాల ఖాతాల్లో వేసేలా క్యాబినెట్ నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. సాంఘిక సంక్షేమ హాస్టల్లో విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న మెస్, కాస్మోటిక్ చార్జీలను వెంటనే విడుదల చేయాలని కోరారు. విద్యార్థుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం జరిగే జాతీయ మహా సభలలో పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

సామాజిక అంశాల సమాహారం సింగంపల్లి కవిత్వం



అశోక్‌కుమార్ మినీ కవితా సంపుటిని ఆవిష్కరిస్తున్న అతిథులు

విజయవాడకల్చరల్: సింగంపల్లి అశోక్ కుమార్ కవిత్వం సామాజిక అంశాల సమాహారమని అభ్యుదయ రచయితల సంఘం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ అన్నారు. సింగంపల్లి అశోక్‌కుమార్ రచించన ఎరుపు మినీ కవితా సంపుటి ఆవిష్కరణ సభ విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ హాల్‌లో బుధవారం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న పెనుగొండ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ నేటి సమాజంలో జరుగుతున్న వాస్తవ సమస్యలకు అశోక్‌కుమార్ అక్షర రూపమిచ్చినట్లు తెలిపారు. సభకు అధ్యక్షత వహించిన ఎక్స్‌రే సాహిత్యసేవా సంస్థ అధ్యక్షుడు కొల్లూరి మాట్లాడుతూ అశోక్‌కుమార్ శ్రీశ్రీ సాహిత్య నిధి ద్వారా శ్రీశ్రీ సాహిత్యాన్ని వెలుగులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. ఏపీటీఎఫ్ పూర్వ కార్యదర్శి పాండురంగ వరప్రసాద్ ఎరుపు కవితా సంపుటిని ఆవిష్కరించారు. సాహితీ స్రవంతి ఉపాధ్యక్షుడు సత్యాజీ, జనసాహితీ అధ్యక్షుడు దివికుమార్, విరసం అధ్యక్షుడు అరసవల్లి కృష్ణ తదితరులు ప్రసంగించారు. రచయిత అశోక్‌కుమార్ తనకు ప్రేరణ కలిగించిన అంశాలను వివరించారు.

మాదిగల ఆత్మీయ సమ్మేళనం జయప్రదం చేయండి

గన్నవరం: విజయవాడలోని జింఖానా గ్రౌండ్‌లో ఈ నెల 20వ తేదీన జరగనున్న మాదిగల ఆత్మీయ సమ్మేళనాన్ని జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మంద వేణు మాదిగ పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం స్థానిక బాబుజగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద ఆత్మీయ సమ్మేళనం కరపత్రాన్ని ఎమ్మార్పీఎస్, ఎంఈఎఫ్, అనుబంధ సంఘాల నేతలతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వేణు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును రాష్ట్రంలో అమలు చేయకపోవడం వల్ల మాదిగ, ఉపకులాలకు చెందిన విద్యార్థులు, నిరుద్యోగులు తీవ్రంగా నష్టపోతున్నారని చెప్పారు. ఎస్సీ వర్గీకరణ అమలు చేసే వరకు ఉద్యోగ నోటిఫికేషన్లు నిలుపుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమస్యలపై ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ నేతృత్వంలో జరగనున్న ఈ సమ్మేళనంలో చర్చించనున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని మాదిగ, ఉపకులాలు ఆత్మీయ సమ్మేళనానికి తరలిరావాలని కోరారు. ఎంఈఎఫ్ నాయకులు దేవరపల్లి విక్టర్ బాబు, ఏసుబాబు, రెల్లి సంఘ నేత ధనియాల నాగరాజు, ఎమ్మార్పీఎస్ నాయకులు నిడమర్తి నాగేశ్వరరావు, కోటేశ్వరరావు తదితరులున్నారు.

కాలుష్య రహిత నగరానికి చర్యలు

వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర



యునిడో ప్రతినిధులతో చర్చిస్తున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరాన్ని కాలుష్య రహితంగా మార్చేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని యునైటెడ్ నేషన్స్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్(యునిడో) ప్రతినిధులకు వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర వివరించారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని ఆయన చాంబర్‌లో యూనిడో ప్రతినిధులతో బుధవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలో ఉన్న సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్(ఎస్టీపీ)లలో జరుగుతున్న అభివృద్ధి పనులను యూనిడో ప్రతినిధులకు వివరించారు. మురుగు నీటి శుద్ధతపై వీఎంసీ తీసుకుంటున్న చర్యలు, యూనిడో నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులను పురోగతి తదితర అంశాలపై చర్చించారు. సమావేశంలో వీఎంసీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వెంకటేశ్వర్ రెడ్డి, సీనియర్ టెక్నికల్ అడ్వైజర్ డాక్టర్ ఎస్పీ సింగ్, కో ఆర్డినేటర్ దీపిక పాల్గొన్నారు.

పార్కులలో ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించండి

పార్కులలో ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించాలని విజయవాడ నగరపాలకసంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశించారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని నూతన భవనం డెప్యూటీ డైరెక్టర్ హార్టికల్చర్ రూమ్‌లో ఉద్యానవనాలపై పార్క్ సూపర్‌వైజర్లతో కమిషనర్ బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. పార్కులలో ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించాలని, నిరంతరం పార్కులలో ఉన్న హరితాన్ని పర్యవేక్షిస్తుండాలన్నారు. పరిశుభ్రతలో ఎటువంటి లోపం లేకుండా చూసుకోవాలని, పార్కులో ఆట పరికరాలు పాడైతే ఇంజినీరింగ్ సిబ్బందితో సమన్వయం చేసుకుని, పరికరాలు ఏర్పాటు చేయాలని చెప్పారు. సమావేశంలో డెప్యూటీ డైరెక్టర్ హార్టికల్చర్ రామ్మోహన్, పార్క్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

కాలువల్లో వ్యర్థాలు వేయకుండా చర్యలు

నగరంలో ప్రధాన కాల్వల్లో వ్యర్థాలు లేకుండా అధికారులు నిరంతరం నిఘా ఉండాలని వీఎంసీ కమిషనర్ హెచ్‌ఎం ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. బందరుకాల్వలో బోటుతో తొలగిస్తున్న వ్యర్థాల తొలగింపు పనులను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. బందరు, ఏలూరు, రైవస్ కాల్వలు నిరంతరం శుభ్రంగా ఉండాలని, అందుకు నగరవాసులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. బయాలజిస్ట్ సూర్యకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

వీఎంసీ కమిషనర్ పేషీపై ఇంటెలిజెన్స్ నిఘా

విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ పేషీలో సుదీర్ఘకాలంగా తిష్టవేసిన పేషీ సిబ్బందిపై ఈ నెల 3వ తేదీన 'పేషీతో పరేషాన్' శీర్షికతో సాక్షి కథనం ప్రచురించగా దీనిపై ప్రభుత్వం స్పందించింది. పేషీలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది ఎంతకాలం నుంచి ఉన్నారు..? ప్రమోషన్లు వచ్చినా సీటు కదలకుండా ఎందుకు ఉంటున్నారు..? రాజకీయ లాబీయింగ్ ఉందా..?, హెచ్‌వోడీలను ఏ విధంగా బెదిరిస్తున్నారనే అంశాలపై ఆరా తీసినట్లు సమాచారం. దీనిపై పేషీకి వచ్చేవారి జాబితా, కమిషనర్‌ను కలిసిన వారి వివరాలు సేకరించినట్లు తెలిసింది. పేషీలో కీలకంగా ఉండే సిబ్బంది అధికారుల నుంచి తీసుకున్న ముడుపుల వివరాలు, రామకుటీర్ పేరుతో సాగిన పంపిణీలు తదితరాలను సేకరించారని సమాచారం. దీనిపై మున్సిపల్ శాఖ మంత్రి కూడా ఆరా తీశారని తెలిసింది.

వరద బాధితులను ఆదుకోవడం మానవ ధర్మం



బాధితులకు నిత్యావసరాలు అందజేస్తున్న ఎమ్మెల్యే సుజనా చౌదరి

భవానీపురం(విజయవాడపశ్చిమ): ముంచుకొచ్చిన బుడమేరు వరద ముంపులో సర్వం కోల్పోయి ఇబ్బందులు పడుతున్న బాధితులను ఆదుకోవడం మానవ ధర్మమని, అందుకు సహకరిస్తున్న సంస్థలు, దాతలు అభినందనీయులని పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే యలమంచిలి సత్యనారాయణ(సుజనా) చౌదరి అన్నారు. నియోజకవర్గంలోని వరద బాధితుల సహాయర్థం ఆయన ఇచ్చిన పిలుపు మేరకు సుజనా ఫౌండేషన్, రౌండ్ టేబుల్ ఇండియా, ఎస్‌బీఐ కార్డ్స్, దీపక్ నెక్స్‌జెన్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలు బుధవారం గొల్లపూడి పంచాయతీ పరిధిలోని హెచ్‌ఓ ఫంక్షన్ హాల్‌లో నిత్యావసర సరుకులు, బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సుజనా చౌదరి మాట్లాడుతూ వరద బాధితులకు తన వంతు బాధ్యతగా సహాయ, సహకారాలను అందిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో కూటమి నాయకులు బొమ్మసాని సుబ్బారావు, మైలవరపు కృష్ణ, లింగం శివప్రసాద్, బొమ్ము గోవింద లక్ష్మి, దుర్గా కిషోర్, పగడాల కృష్ణ, కొనికి కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

గాంధీహిల్‌న పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తాం...

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):మహాత్మా గాంధీ స్మారక చిహ్నంగా ఉన్న గాంధీ కొండను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తామని పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు వై.సుజనాచౌదరి తెలిపారు. గాంధీహిల్ ప్రాంగణంలో అభివృద్ధి చేసిన నక్షత్ర ప్రదర్శన శాలను (ప్లానిటోరియం) ఎమ్మెల్యే బుధవారం ప్రారంభించారు. సుమారు రూ.82 లక్షలతో దీనిని ఆధునికీకరించారని చెప్పారు. విద్యార్థులకు అంతరిక్షం, గ్రహ కదలికల గురించి అవగాహన కల్పించడంలో, సైన్స్ అండ్ టెక్నాలజీకి సంబంధించిన అనేక అంశాలను ప్లానిటోరియం ద్వారా తెలుసుకోవచ్చని పేర్కొన్నారు. జోనల్ కమిషనర్ రమేష్ కీర్తన, సీఎంహెచ్‌ఓ ఇన్చార్జి సురేష్‌బాబు, ఈఈ వెంకటేశ్వర రెడ్డి, టెక్నికల్ అడ్వైజర్ నారాయణమూర్తి కూటమి నేతలు అడ్డూరి శ్రీరామ్, బుల్లా విజయ్, అర్షద్, తదితరులు పాల్గొన్నారు.

రాజకీయాలకు అతీతంగా పని చేయాలి...

విద్యాసంస్థలు రాజకీయాలకు అతీతంగా పని చేయాలని పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యుడు వై.సుజనాచౌదరి తెలిపారు. కేబీఎన్ కళాశాల 60వ వ్యవస్థాపక దినోత్సవం ఆ కళాశాల ప్రాంగణంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన సుజనాచౌదరి మాట్లాడుతూ ఆరు దశాబ్దాలుగా విద్యారంగానికి సేవలందిస్తున్న యాజమాన్యాన్ని అభినందిస్తున్నట్లు చెప్పారు. హిందూ హైస్కూల్స్ కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి. శేషయ్య, జి.మల్లయ్య, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ వి. నారాయణరావు, కళాశాల కళాశాల కార్యదర్శి టి.శ్రీనివాసు, ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణవేణి పాల్గొన్నారు.

రూ.52.60 లక్షల ప్యాకేజీతో అమెజాన్‌లో ఉద్యోగం

పెనమలూరు: కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ డీమ్డ్ టుబి యూనివర్సిటీలో బీటెక్ చదువుతున్న విద్యార్థిని నిహిత వేములపల్లి బహుళజాతి సంస్థ అయిన అమెజాన్‌లో మంచి ప్యాకేజీతో ఉద్యోగం సాధించింది. ఈ మేరకు రిజిస్ట్రార్ డాక్టర్ ఎం. రవిచంద్ బుధవారం వివరాలు తెలుపుతూ నిహిత అమెజాన్‌లో రూ.52.60 లక్షల ప్యాకేజీతో సొల్యూషన్ ఆర్కిటెక్‌గా ఉద్యోగం పొందిందన్నారు. నిహితకు వైస్ చాన్స్‌లర్ డాక్టర్ పీవీ రావు, ప్రైవైస్‌చాన్స్‌లర్ డాక్టర్ ఏవీ రత్నప్రసాద్, డీన్ రాజేశ్వరరావు, ఉపాధికల్పన అధికారి కె.శ్రీనివాస్, కాలేజీ యాజమాన్యం అభినందనలు తెలిపారు.

దళిత క్రైస్తవులకు ఎస్సీ రిజర్వేషన్ రాజ్యాంగ విరుద్ధం



రెవెన్యూ అధికారికి వినతి పత్రం ఇస్తున్న వేదిక నాయకులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): దళిత క్రైస్తవులకు ఎస్సీ రిజర్వేషన్ కల్పించడం రాజ్యాంగ విరుద్ధమని ఎస్సీ, ఎస్టీ హక్కుల సంక్షేమ వేదిక రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గరికముక్కు సుబ్బయ్య, జి. జాషువా అన్నారు. ఈ మేరకు జిల్లా రెవెన్యూ అధికారి మన్నం లక్ష్మీనరసింహను బుధవారం కలిసి వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా సుబ్బయ్య, జాషువా మాట్లాడుతూ దళిత క్రైస్తవులను షెడ్యూల్ కులాల్లో చేరిస్తే దాని పరిణామం దళిత హిందూ సమాజంపై పడుతుందని, వారి అభివృద్ధికి ఆటంకం ఏర్పడుతుందని తెలిపారు. సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా ఎస్సీలు వెనుకబడి పోతారని చెప్పారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చేసిన దీర్ఘకాల పోరాట ఫలితం వృథా అవుతుందని పేర్కొన్నారు. మతం మార్చుకున్న క్రైస్తవులకు రిజర్వేషన్ సౌకర్యం కల్పించడానికి వీలు లేదని అనేక సందర్భాల్లో ఉన్నత న్యాయస్థానాలు తీర్పులు ఇచ్చినట్లు గుర్తు చేశారు. వినతి పత్రం సమర్పించినవారిలో వేదిక విజయవాడ మహానగర్ అధ్యక్షులు చింతల లక్ష్మయ్య, కట్టా దేవరాజు, ఎస్.శ్రీనివాసరావు, రాజేశ్వరరావు, రామారావు, సదాశివరావు తదితరులు ఉన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

రామవరప్పాడు: మత్తు పదార్థాలకు యువత, విద్యార్థులు దూరంగా ఉండాలని పటమట సీఐ పవన్ కిషోర్ అన్నారు. విజయవాడరూరల్ మండలం ఎనికేపాడు విజయ ఫార్మసీ కళాశాలలో బుధవారం నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో కెపాసిటీ బిల్డింగ్ ప్రోగ్రాం వర్క్ షాపు ఆన్ డ్రగ్ ప్రివెన్షన్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పవన్ కిషోర్ మాట్లాడుతూ సరదాగా మొదలైన అలవాటు కాస్తా బానిసలుగా మారుస్తాయన్నారు. డ్రగ్స్‌కు సంబంధించిన చట్టాలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. మరో అతిథి డాక్టర్ స్వరాజ్య లక్ష్మి మాట్లాడుతూ ప్రస్తుతం యువత, విద్యార్థులు డ్రగ్స్ బారిన పడి తమ విలువైన జీవితాలు నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబ వ్యవస్థ, సమాజంలో గౌరవ మర్యాదలు నాశనం చేసే మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. అనంతరం పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా డ్రగ్స్ – దుష్పరిణామాలు అంశంపై అవగాహన కల్పించారు. యువత ఏ విధంగా ఆకర్షితులవుతున్నారు, వాటి బారి నుంచి ఎలా రక్షించుకోవాలని అనే విషయాల గురించి వివరించారు. నెహ్రూ యువ కేంద్రం యూత్ ఆఫీసర్ సుంకర రాము మాట్లాడుతూ మత్తు పదార్థాల వినియోగంపై కలిగే అనర్థాలపై నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో అనేక అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.యువజన సర్వీసుల శాఖ నుంచి శ్రీనివాసరావు, అసిస్టెంట్ మేనేజర్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.